


సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 1902 క్యూసెక్కులు విడుదల చేశారు. మిగిలిన కాలువలకు కూడా నీటిని విడుదల చేశారు.



దుర్గమ్మ ఆదాయం రూ.3.68 కోట్లు

విజయవాడ : ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గా మల్లేశ్వరస్వామికి భక్తులు హుండీల ద్వారా రూ.3.68 కోట్ల నగదును కానుకలు, మొక్కుబడులుగా సమర్పించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 579.00 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,067 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

తపాలా లేఖ పోటీల గడువు పెంపు

నరసరావుపేట టౌన్: తపాలా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ లేఖా రచన పోటీల గడువును జనవరి 31 వరకు పొడిగించినట్లు పోస్టల్ సూపరింటెండెంట్ పి.వెంకటస్వామి బుధవారం తెలిపారు. గతంలో పోటీలకు పంపే లేఖలను ఈనెల 14లోపు పంపాలని ప్రకటించగా, ప్రస్తుతం గడువు పెంచుతూ నిర్ణయించినట్లు వివరించారు. విద్యార్థులు, యువతకు లేఖలు రాయటాన్ని అలవాటు చేసేందుకు తపాలా శాఖ ఢాయి ఆఖర్ పేరుతో లేఖా పోటీలను నిర్వహిస్తున్నట్లు వివరించారు.

సంకటహర చతుర్థి పూజలు



అమరావతి: ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలోని విఘ్నేశ్వర స్వామి ఉపాలయంలో బుధవారం సంకటహర చతుర్థి పూజలను నిర్వహించారు. ఆలయ అర్చకస్వామి జగర్లపూడి శేషసాయి శర్మ విఘ్నేశ్వర స్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. స్వామికి వివిధ రకాల పుష్పాలతో, గరికెతో విశేషాలంకారం చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి ఉండ్రాళ్లను సమర్పించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ధాన్యం బ్రోకర్ ఆఫీస్‌లో విజిలెన్స్ తనిఖీలు!

కారెంపూడి: విజిలెన్స్ అధికారులు కారెంపూడిలోని ఒక ధాన్యం బ్రోకర్ ఆఫీస్‌లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఆఫీస్‌లో రికార్డులు పరిశీలించారు. ఈ ఆఫీస్ నుంచి పెద్దాపురంలోని లలిత బ్రాండ్ కంపెనీకి ఎగుమతి అయిన ధాన్యం వివరాలను అధికారులు సేకరించారు. ఇదిలా ఉంటే తనిఖీ అధికారులు మీడియాతో మాట్లాడడానికి, వివరాలు వెల్లడించడానికి నిరాకరించారు.

మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు

నరసరావుపేట: ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర మేరకే జిల్లాలో రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ పి.సుశీల పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. ఖరీఫ్ పంట కాలానికి 28 మండలాల్లో 115 క్లస్టర్ రైతు సేవా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు మూడు రైతుసేవా కేంద్రాల ద్వారా ఆరుగురు రైతుల వద్ద నుంచి 31.480 మెట్రిక్ టన్నుల ధాన్యం కనీస మద్దతు ధరకు కొనుగోలు చేశామన్నారు. రైతులకు గోనె సంచులు, టార్పాలిన్ పట్టాలు అందుబాటులో ఉంచామన్నారు.

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్‌లో యువకుడి ప్రతిభ



సత్తెనపల్లి: జాతీయ స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో సత్తెనపల్లికి చెందిన యువకుడు ప్రతిభ కనబరిచి జాతీయ రికార్డ్ సాధించటంతోపాటు బంగారు, వెండి పతకాలను కైవసం చేసుకున్నాడు. ఢిల్లీలోని కర్ణాలి సింగ్ స్టేడియంలో జరుగుతున్న ఫెడరేషన్ కప్ మెన్–ఉమెన్ ఎక్విప్‌డ్ జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు ఈనెల 16 నుంచి 19 వరకు మూడు రోజుల పాటు జరుగుతున్నాయి. ఈ పోటీలలో రాష్ట్ర జట్టులో సత్తెనపల్లికి చెందిన క్రీడాకారుడు పసుపులేటి వంశీకృష్ణ ప్రతిభ కనబరిచాడు. డెడ్‌లిఫ్ట్‌లో 297.5 కేజీలు ఎత్తి వంశీకృష్ణ సరికొత్త జాతీయస్థాయి రికార్డు సృష్టించాడు. జూనియర్స్‌లో 74 కిలోల విభాగంలో మొత్తం 680 కేజీలు ఎత్తి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు, వెండి పతకాలు కైవసం చేసుకున్నాడు. త్వరలో జరగనున్న ఆసియా, యూఎస్‌ఏలో జరగనున్న వరల్డ్ చాంపియన్ షిప్ పోటీలకు అర్హత సాధించాడు. వంశీకృష్ణను పవర్ లిఫ్టింగ్ పల్నాడు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ, అంతర్జాతీయ పవర్‌లిఫ్టర్ పసుపులేటి సురేష్, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ పల్నాడు జిల్లా ప్రెసిడెంట్ జిమ్ రాజు, తిరుమలశెట్టి శంకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాతంగి సాంబశివరావు, కత్తి పవన్ తదితరులు అభినందించారు.

సాహిత్య శిఖరాన అభ్యుదయ దీపిక



- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపిక
- లక్ష్మీనారాయణ స్వగ్రామం పాతచెరుకుంపాలెం
- గ్రామస్తుల హర్షాతిరేకాలు

పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర ప్రభుత్వ అత్యున్నత పురస్కారం

సాహిత్య శిఖరాన వినుకొండ కీర్తిబావుటా రెపరెపలాడింది. ఈ ప్రాంత వాసికి కేంద్ర ప్రభుత్వ అత్యున్నత పురస్కారం దక్కింది. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు వినుకొండ ప్రాంతంలోని నూజెండ్ల మండలం పాతచెరుకుంపాలెం గ్రామ వాసి పెనుగొండ లక్ష్మీనారాయణ ఎంపికయ్యారు. కవి సామ్రాట్ గుర్రం జాషువా తర్వాత సాహిత్య లోకంలో వినుకొండ ఖ్యాతిని చాటిచెప్పిన ఘనత లక్ష్మీనారాయణకు దక్కుతోందనడంలో అతిశయోక్తి లేదు.

వినుకొండ(నూజెండ్ల): కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు పెనుగొండ లక్ష్మీనారాయణ ఎంపిక కావడంపై వినుకొండ ప్రాంతంలో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన స్నేహితులు, పాతచెరుకుంపాలెం గ్రామస్తులు ఈ అవార్డు తమ గ్రామానికి దక్కినట్టుగా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 1954లో పాత చెరుకుంపాలెం గ్రామంలో గోవిందరెడ్డి, లింగమ్మ దంపతులకు రెండో సంతానంగా లక్ష్మీనారాయణ జన్మించారు. తండ్రి అదే గ్రామంలో బ్రాంచ్ పోస్టు మాస్టారుగా, గ్రామ మునసబుగా సేవలందించారు.

విద్యాభ్యాసం

1 నుంచి ఐదో తరగతి వరకూ చెరుకుంపాలెంలోనే లక్ష్మీనారాయణ ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. తరువాత 6 నుంచి 10వ తరగతి వరకూ ఫిరంగిపురంలోని సెయింట్ పాల్ ఉన్నత పాఠశాలలో




చెరుకుంపాలెంలో లక్ష్మీనారాయణ నివసించిన ఇల్లు

చదివారు. ఇంటర్ వినుకొండ ప్రభుత్వ కళాశాలలో, ఉన్నత చదువులు గుంటూరులో పూర్తిచేశారు.

మాజీ ఎమ్మెల్యే ప్రోత్సాహంతో..

వినుకొండ మాజీ ఎమ్మెల్యే పులుపుల వెంకట శివయ్య ప్రోత్సాహంతో సాహిత్యం వైపు అడుగులు వేసి అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులుగా సేవలు అందించారు. ప్రస్తుతం అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులుగా సేవలందిస్తున్నారు. ఈ సంఘం అధ్యక్షులుగా పనిచేస్తున్న తొలి తెలుగు వాడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ప్రకటించింది. ప్రస్తుతం లక్ష్మీనారాయణ గుంటూరులో స్థిరపడ్డారు. ఆయన రచించిన సాహిత్య వ్యాస సంపుటి దీపికకు ఈ అవార్డు లభించడం విశేషం.



కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన సంపుటి

స్నేహితుడిగా ఆనందంగా ఉంది



నేను, లక్ష్మీనారాయణ ఫిరంగిపురంలోని సెయింట్ పాల్ పాఠశాలలో 10వ తరగతి వరకు చదువుకున్నాం. చిన్నతనం నుంచే సాహిత్యంపై ఆసక్తి కలిగిన లక్ష్మీనారాయణ తరువాత లా వరకు చదివి సాహిత్యంపై ఆసక్తితో ఆ రంగంలోకి వెళ్లారు. అనేక కవితలు రాశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సాహిత్య అకాడమీ అవార్డు అందుకోవడం గర్వకారణం. అతను నా స్నేహితుడు కావడం ఎంతో ఆనందంగా ఉంది.

దగ్గుబాటి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్, పాతచెరుకుంపాలెం

ఇప్పటికీ కలుస్తూనే ఉంటాం



లక్ష్మీనారాయణ చిన్నతనం నుంచి మిత్రుడు. ఫిరంగిపురంలో ఇద్దరం కలిసి చదివాం. ఇప్పటికీ కలుస్తూనే ఉంటాం. ఆనందంగా ఉంది.

– వై.శేషగిరిరావు, విశ్రాంత ఉపాధ్యాయులు

కలిసి చదువుకున్నాం



లక్ష్మీనారాయణ, నేను కలిసి చదువుకున్నాం. చిన్నతనం నుంచి చురుకుగా ఉండే లక్ష్మీనారాయణ సాహిత్య అకాడమీ అవార్డు అందుకోవడం మా గ్రామానికే గర్వకారణం. ఉన్నత చదువులు చదువుకుని అవార్డు అందుకోవడం అందరికీ ఆదర్శం.

– సూరెనాసర్‌రెడ్డి, పాతచెరుకుంపాలెం

ఆప్యాయంగా పిలుస్తారు



మేం ఇద్దరం పాతచెరుకుపాలెంవాసులమే. చిన్నతనం నుంచి మాకు మంచి సంబంధాలు ఉన్నాయి. లక్ష్మీనారాయణ నన్ను అరే రామయ్య అని ఆప్యాయంగా పిలుస్తారు. కేంద్ర ప్రభుత్వ సాహిత్య అకాడమీ అవార్డు రావడం మా గ్రామానికే గర్వకారణం.

జెడ్డా సుబ్బులు రామయ్య, జెడ్పీటీసీ, పాత చెరుకుంపాలెం

అభినందనలు



వినుకొండ ప్రాంతవాసి అయిన లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం రావడం గర్వకారణం. వినుకొండ ప్రాంతం కవులకు కళాకారులకు పుట్టినిల్లు. ఈప్రాంత కవిగా ఆయనకు అభినందనలు.

– కవికరీముల్లా, వినుకొండ, ఉపాధ్యాయుడు, కవి

సొసైటీల మొండి బకాయిలు 80 శాతం తగ్గించండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం



సమీక్ష చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: వచ్చే మార్చి నాటికి జిల్లాలోని సహకార సంఘాల మొండి బకాయిలు 80శాతం తగ్గించాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలోని సహకార సంఘాల మొండి బకాయిలు రూ.50కోట్లకు మించి ఉన్నాయని, బకాయిలను తగ్గించడం ద్వారానే సంఘాలు బలోపేతం అవుతాయన్నారు. బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నాల్గవ జిల్లా సహకార సంఘాల అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సహకార సంఘాల అభివృద్ధి పంచవర్ష ప్రణాళికకు ఆమోదం తెలిపారు. 23 సహకార సంఘాల గోడౌన్లకు డ్వామా సాయంతో రోడ్డు సదుపాయం కల్పించాలని, నాలుగు కొత్త జన ఔషధి కేంద్రాలను ప్రారంభించాలని, పెట్రోల్, గ్యాస్ స్టేషన్ల ఏర్పాటుపై దృష్టిసారించాలని సూచించారు. కోల్డ్ స్టోరేజీలు, ఎరువుల షాపులు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, సూపర్ మార్కెట్ల సంఖ్యను పెంచాలన్నారు. పైలట్ ప్రాజెక్టుగా కారుమంచి, బొగ్గారం, ముప్పాళ్ల, శావల్యాపురం, అమరావతి, అత్తలూరు గ్రామాల్లో పీఎం సూర్యఘర్ పథకం ద్వారా 300 యూనిట్ల లోపు విద్యుత్ వాడే సహకార సంఘాల సభ్యులకు సోలార్ ప్యానెల్ల ఏర్పాటుకు రుణం, సబ్సిడీ అందించాలన్నారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, జిల్లా సహకార అధికారి వెంకటరమణ, నాబార్డు డీడీఎం శరత్, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, పశు సంవర్ధక శాఖ అధికారి టి.కాంతారావు, మత్స్య అధికారి ఎన్.సంజీవరావు, పంచాయతీ రాజ్ ఏఈ జయ కృష్ణ, సహకార బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

సర్కారు ఆదు'కొనడం లేదు'

- ధాన్యం రైతుల ఆవేదన
- అందుబాటులోకి రాని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు
- అడ్డగోలుగా దోచుకుంటున్న దళారులు
- ధరలో కోత విధిస్తున్న వ్యాపారులు



కంభంపాడు గ్రామంలో ధాన్యం ఆరబెట్టి గోతాలలోకి నింపుతున్న రైతులు

మాచర్ల రూరల్: ధాన్యం రైతును సర్కారు ఆదుకొనడం లేదు. దళారులు దోచుకుంటున్నారు. వ్యాపారులు ధరలో కోత విధిస్తున్నారు. ఫలితంగా అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పల్నాడు జిల్లా మాచర్ల మండలంలోని కంభంపాడు, గన్నవరం, జమ్మలమడక, తాళ్ళపల్లి, పసువేముల, కొత్తూరు, ఏకోనాంపేట గ్రామాలలో సోనామసూరి, సన్నాల రకాలను ఎక్కువగా సాగు చేస్తుంటారు. ఎకరాకు సగటున 35 నుంచి 40 బస్తాల దిగుబడి వస్తుంది. కింటా ధాన్యానికి గ్రేడును బట్టి రూ.2,350 మద్దతు ధరను కేంద్రం ప్రకటించింది. అయితే మాచర్ల మండలంలోని రైతు భరోసా కేంద్రాలలో రాష్ట్ర సర్కారు ధాన్యం కొనుగోలు చేయటం లేదు. దీంతో పెట్టుబడి కోసం అప్పులు చేసిన రైతన్నలు వ్యాపారులకే విక్రయించాల్సి వస్తోంది. దీనిని తమకు అనుకూలంగా మార్చుకున్న వ్యాపారులు, దళారులు ధరలో భారీగా కోత విధిస్తున్నారు. రైతులను నిలువునా దోచుకుంటున్నారు. గత ఏడాది 75 కిలోల ధాన్యం బస్తా రూ.1,800 నుంచి రూ.2వేల వరకు పలకగా, ఈ ఏడాది రూ. 1400లకు పడిపోవడమే దీనికి నిదర్శనం. ఎన్నడూ లేని విధంగా ఇంతగా ధర పడిపోవటంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ప్రస్తుత వాతావరణం దృష్ట్యా తేమ శాతాన్ని సాకుగా చూపి మరింత ధర తగ్గిస్తున్నారని రైతులు లబోదిబోమంటున్నారు. అయినా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

75 కిలోల ధాన్యం ధర ఇలా..	
గత ఏడాది :	1,800-2,000
ప్రస్తుతం :	1,300- 1,400
కేంద్రం ప్రకటించిన మద్దతు ధర :	2,350

కౌలు రైతుకు కోలుకోలేని దెబ్బ

పంటను కౌలుకు తీసుకొని సాగుచేసే రైతన్నకు ఈ ధరలతో కోలుకోలేని దెబ్బ తగులుతోంది. ఎకరా సాగుకు రూ.40 వేలు పంటకు పెట్టుబడి పెడితే కౌలుతో కలిపి రూ.60 వేల నుంచి రూ.65 వేల వరకు ఖర్చు అవుతోంది. ఎకరా పంట అమ్మితే రూ.52 వేలు వస్తుంది. కౌలు రైతు ఎకరాకు కనీసం రూ.10 వేల వరకు నష్టపోతున్నాడు. ప్రతి ధాన్యం గింజనూ కొంటామని, కొన్న 24 గంటల్లో నగదును ఖాతాల్లో జమ చేస్తామన్న ప్రభుత్వ మాటలు ఒట్టి బూటకమని తేలిపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధరకు ధాన్యం కొనుగోలు చేసి అన్నదాతలను ఆదుకోవాలని అందరూ ముక్తకంఠంతో కోరుతున్నారు.



బస్తాల్లోకి ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు

ధాన్యం కొనట్లేదు



నాలుగు ఎకరాల్లో వరిపంట సాగు చేశా. రెండు ఎకరాలు కౌలుకు తీసుకొన్నా. కోసిన ధాన్యాన్ని బస్తాలకు నింపి 20 రోజులవుతున్నా ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదు. ఆధార్‌కార్డు, పాసుబుక్‌లను ఆన్‌లైన్‌లో చేయాలని చెబుతున్నారు. వ్యాపారులకే 75 కేజీల బస్తాకు రూ. 1,400 చొప్పున అమ్మాల్సి వచ్చింది.

– బొద్దు నరసింహారావు, రైతు, లింగాపురం

గిట్టుబాటు ధరలేదు.



గత ఏడాది రూ.1800ల నుంచి రూ. 2వేలు పలికిన 75 కేజీల బస్తా ధాన్యం ఇప్పుడు రూ. 1400కు మించి పలకడం లేదు. ఈ రేటుకు అమ్మితే గిట్టుబాటు కాదు. అప్పులే మిగులుతాయి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

– యంద్ర గాలయ్య, రైతు, తాళ్ళపల్లి

ప్రభుత్వం నిర్దేశించిన మిల్లర్లు కొంటారు

ధాన్యాన్ని ప్రభుత్వానికి అమ్మాలనుకునే రైతులు ముందు రైతు భరోసా కేంద్రాల్లో ఆన్‌లైన్ చేసుకోవాలి. ఆధార్‌కార్డు, పాస్‌బుక్ వివరాలు నమోదు చేసుకోవాలి. తేమశాతం 12కు తగ్గకుండా ఉంటే ప్రభుత్వం నిర్దేశించిన మిల్లర్లు వచ్చి కొనుగోలు చేస్తారు. మాచర్ల సమీపంలోని దాచేపల్లి, వినుకొండ, రొంపిచర్లకు చెందిన మిల్లర్లు ధాన్యం కొంటున్నారు.

– జగదీష్‌రెడ్డి, ఏడీఏ, మాచర్ల

జీజీహెచ్‌లో పోస్టుల భర్తీకి చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్‌లో అత్యవసర వైద్య సేవలు రోగులకు అందించేందుకు ఖాళీగా ఉన్న వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర యశస్వి రమణ తెలిపారు. 'సాక్షి'లో బుధవారం 'అత్యవసరం ... అత్తెసరే..! శీర్షికతో ట్రామాకేర్ సెంటర్‌లో ఖాళీ పోస్టుల గురించి, క్యాజువాల్టీ, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగంలో సకాలంలో వైద్య సేవలు అందకపోవడంతో రోగులు పడుతున్న బాధల గురించి కథనం ప్రచురితమైంది. దీనిపై సూపరింటెండెంట్ స్పందించారు. పోస్టుల భర్తీకి ఉన్నతాధికారులను అనుమతి కోరుతామన్నారు. ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్‌ను ఆధునికీకరించి వారం రోజుల్లోనే ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

ఎన్జీ రంగా వర్సిటీలో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో దూరవిద్యా కేంద్రం ద్వారా ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులను జనవరి నుంచి ప్రారంభించనున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు బుధవారం తెలిపారు. చిరుధాన్యాల పంట సాగు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

అనుబంధాలు దిన ధన గండం

- మృగ్యమవుతున్న మానవ సంబంధాలు
- రక్తసంబంధాలను మరిపిస్తున్న దానవత్వం
- కుటుంబ సభ్యులనే హతమారుస్తున్న దౌష్ట్యం

సాక్షి, నరసరావుపేట: కార్ల్‌మార్క్స్ అన్నట్టు మానవ బంధాలన్నీ ఆర్థిక సంబంధాలేనా.. ప్రేమ, ఆప్యాయత ఇవేమీ ఉండవా.. రక్తసంబంధీకులపై మమకారం మచ్చుకైనా కానరావట్లేదా.. ప్రస్తుతం జరుగుతున్న వరుస దురాగతాలు చూస్తుంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. ఆస్తులు, డబ్బు కోసం మనిషి దిగజారిపోతున్నాడని, మానవత్వం మసకబారి దానవత్వం జడలు విప్పుతోందని స్పష్టమవుతోంది. అనుబంధాలు దినదినగండంగా మారుతున్నాయనే వాదన బలంగా వినిపిస్తోంది. ప్రస్తుతం మనుషులు అనుబంధాల కంటే ఆర్థిక పరమైన అంశాలకే విలువనిస్తున్నారు. ఆసరాగా ఉండాల్సిన రక్తసంబంధీకులే రాబందులుగా మారుతున్నారు. తోడబుట్టిన వాళ్లే తోడేళ్లై విరుచుకుపడుతున్నారు. కన్నపేగే కాలనాగై కాటేస్తోంది. ఆస్తి కోసమో.. క్షణికావేశమో.. కుటుంబ సభ్యుల ప్రాణాలు తీసే స్థాయికి మానవుడు దిగజారిపోతున్నాడు. విలువలు అధఃపాతాళంలోకి జారిపోతున్నాయి. తాజాగా పల్నాడు జిల్లా నకరికల్లులో అన్న, తమ్ముడిని సొంత సోదరి చంపిన ఉదంతం ధనరాక్షసాన్ని కళ్లకు కట్టింది. మానవ సంబంధాలపై చర్చకు తెరలేపింది.

డబ్బు కోసం క్రూరాతిక్రూరంగా..

ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న తండ్రి మరణంతో వచ్చే రూ.70 లక్షల కోసం ఏకంగా సొంత అన్న, తమ్ముడిని చంపిందో ఓ యువతి. నకరికల్లుకు చెందిన కృష్ణవేణి తమ్ముడు దుర్గా రామకృష్ణ ఈ ఏడాది నవంబర్ 26 నుంచి కనిపించకుండాపోయాడు. తరువాత ఈనెల 10 నుంచి కృష్ణవేణి అన్న గోపికృష్ణ కూడా కనిపించకుండా పోయాడు. ఏంటా విషయం అని ఆరాతీయగా కృష్ణవేణి తండ్రి పౌలురాజు చనిపోవడంతో వచ్చే రూ.70 లక్షల కోసం పథకం ప్రకారం వారిద్దరినీ చంపిందని తేలింది. 15 రోజుల వ్యవధిలో తోడబుట్టిన వాళ్లను బలితీసుకున్న ఆ మహిళ ఎంత క్రూరంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.

అయినవారిపైనే ఫిర్యాదులు

కన్న కొడుకులు, తోబుట్టువుల దురాగతాలపై ప్రతి వారం ఎస్పీ కార్యాలయం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార విభాగానికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

- పొలం కోసం కుమారులు తనపై దాడి చేసి చంపేందుకు యత్నించారని నవంబర్ 11న శావల్యాపురం మండలం మతుకుమల్లికి చెందిన నాగయ్య ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. తనకు ఐదెకరాల పొలం ఉండగా ఇద్దరు కుమారులకు రెండు ఎకరాల చొప్పున రాసిచ్చానని, మిగిలిన పొలం తన కోసం ఉంచుకున్నానని, దానినీ ఇచ్చేయాలని వేధిస్తూ దాడి చేశారని విలపించాడు.
- ఇంటిని తమ పేరుమీద రాసి ఇవ్వాలని చావబాదుతున్నారని, లేకపోతే చంపుతామంటున్నారని పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు గ్రామానికి చెందిన సయ్యద్ కరీమూన్ పల్నాడు ఎస్పీని ఈనెల 16న కలిసి ఆవేదన వ్యక్తం చేశారు.
- ఇలాంటి ఫిర్యాదులు ప్రతివారం కోకొల్లలుగా వస్తున్నాయి.




కన్న కొడుకులపై ఫిర్యాదు చేయడానికి ఈనెల 16న ఎస్పీ కార్యాలయానికి వచ్చిన వృద్ధమహిళ

ఆస్తి కోసం కొడుకు కర్కశం



గత వారంలో బాపట్ల మండలం అప్పికట్ల గ్రామానికి చెందిన రిటైర్డ్ హెడ్‌మాస్టర్ పాగోలు విజయ భాస్కరరావు, అతని భార్య వెంకట సాయికుమారిని కన్నకొడుకు కిరణ్ రోకలి బండతో మోది హతమార్చాడు. బతికుండగానే ఆస్తి మొత్తం తన పేరిట రాసివ్వాలని, సోదరికి ఆస్తిలో వాటా ఇవ్వకూడదని తండ్రితో గొడవకు దిగిన కిరణ్ రోకలి బండతో తలపై బలంగా మోది చంపేశాడు. అడ్డుచ్చిన తల్లినీ కర్కశంగా హతమార్చాడు.

క్షణికావేశంతోనే..



ఆస్తి కోసమో, పంతం కోసమో సొంత కుటుంబ సభ్యులపై దాడులు, హత్యలు చేస్తున్న ఘటనలు చూస్తున్నాం. క్షణాకావేశంతో తాము ఏమి చేస్తున్నాం అన్న స్పృహ లేకపోవడంతోనే ఈ దారుణాలకు ఒడిగడుతున్నారు. కుటుంబ విలువలు తగ్గిపోవడం కూడా దీనికి మరో హేతువు. చిన్ననాటి నుంచి పిల్లలకు నైతికవిలువలు నేర్పాలి. తోబుట్టువులు, స్నేహితులతో ఎలా మెలగాలో వివరించాలి.

– డాక్టర్ వి.వి.కిరణ్, అసోసియేట్ ప్రొఫెసర్, మానసిక వైద్యులు, జీజీహెచ్, గుంటూరు

క్లుప్తంగా

టెన్త్ విద్యార్థుల వివరాలు సరిచూసుకోండి

హెచ్ఎంలకు డీఈఓ చంద్రకళ ఆదేశం



నరసరావుపేట ఈస్ట్: పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల వివరాలను సవరించేందుకు ఈనెల 19 నుంచి 23 వరకు ఎడిట్ ఆప్షన్ అందుబాటులో ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, ప్రభుత్వ పరీక్షల జిల్లా అసిస్టెంట్ కమిషనర్ కె.ఎం.ఎ.హుస్సేన్ బుధవారం తెలిపారు. పల్నాడు జిల్లా పరిధిలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్ పదో తరగతి మార్చి–2025 పబ్లిక్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో మరోసారి సరిచూసుకొని తప్పుగా నమోదు చేసి ఉంటే వెంటనే సవరించాలని సూచించారు.

వ్యక్తిపై దాడి



రాజుపాలెం: పాతకక్షల నేపథ్యంలో వ్యక్తిపై గొడ్డలితో దాడిచేసిన ఘటన మండలంలోని పెదనెమలిపురిలో మంగళవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన కంకణంపాటి మారుతీకృష్ణ తన ఇంటిలో నిద్రిస్తుండగా అదే గ్రామానికి చెందిన ముప్పాళ్ల బాలకృష్ణ మంగళవారం అర్ధరాత్రి గొడ్డలితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన మారుతీకృష్ణను సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వేణుగోపాల్ బుధవారం ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.

హామీలు అమలు చేయని కూటమి సర్కారు

నరసరావుపేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని ఎంసీపీఐయూ పల్నాడు జిల్లా కార్యదర్శి షేక్ రెడ్‌బాషా విమర్శించారు. బుధవారం స్థానిక పనస తోటలోని జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. ఈనెల 29న తమ పార్టీ ఆధ్వర్యంలో విజయవాడలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, మనువాద ఫాసిస్టు కార్పొరేట్ శక్తుల ప్రమాదం, కమ్యూనిస్టు, వామపక్ష సామాజిక శక్తుల కర్తవ్యం అనే అంశంపై నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరారు, దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో సీనియర్ కమ్యూనిస్టు నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తూమాటి శివయ్య, జాతీయ కమిటీ సభ్యులు షేక్ ఖాదర్‌బాషా, గుంటూరు పార్టీ కార్యదర్శి అమృతలూరు వెంకటేశ్వరరావు, రాష్ట్ర మహిళా సంఘం కార్యదర్శి నాగలక్ష్మి పాల్గొన్నారు.

గ్రామసభలో ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేయాలి

- అధికారులతో కలెక్టర్ అరుణ్‌బాబు
- సందెపూడి రెవెన్యూ సదస్సు ఆకస్మిక తనిఖీ



సందెపూడిలో జరిగిన రెవెన్యూ సదస్సులో అర్జీల ఆన్‌లైన్‌ను ప్రక్రియపై ఆరా తీస్తున్న కలెక్టర్ అరుణ్

యడ్లపాడు: రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. యడ్లపాడు మండలం సందెపూడి గ్రామంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామసభ నిర్వహణ, రైతుల నుంచి అర్జీల స్వీకరణ, వాటిని ఆన్‌లైన్ రిజిస్టర్ చేసి తక్షణమే రశీదు అందజేస్తున్నారా లేదా అనే విషయాలపై ఆరా తీశారు. అనంతరం స్థానికులతో కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సుల ఉద్దేశమన్నారు. త్వరలో కొత్త రేషన్ కార్డుల జారీతోపాటు సవరణలకు ప్రభుత్వం అవకాశం ఇస్తుందని చెప్పారు. కొత్త ఏడాదిలో పింఛన్ మంజూరు ఉండొచ్చని వివరించారు. గ్రామసభలో వచ్చిన ప్రతి అర్జీనీ అధికారులు ఆన్‌లైన్ చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం గ్రామస్తుల నుంచి వచ్చిన అర్జీలను కలెక్టర్ స్వయంగా పరిశీలించి ఆన్‌లైన్ రిజిస్టర్ చేయించారు. సందెపూడి –తుర్లపాడు గ్రామాల మధ్య కల్వర్టు సమీపాన ఓ రైతు తన పొలంలో గోడ నిర్మించాడని, ఆ గోడను తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారుల దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో నరసరావుపేట ఆర్డీఓ మధులత, యడ్లపాడు తహసీల్దార్ జెట్టి విజయశ్రీ, ఆర్ఐ జయబాబు, మండల సర్వేయరు గేరా సురేంద్రనాథ్, ఈవో రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్ సేవలు ఎంతో కీలకం

వీసీ ఆచార్య గంగాధరరావు



ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య కె.గంగాధరరావు

ఏఎన్‌యూ: హెల్త్ కేర్ రంగంలో ప్రొఫెషనల్స్ సేవలు ఎంతో కీలకమని వీసీ ఆచార్య కె. గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో 'అంతర్జాతీయ హెల్త్ కేర్ పరిశ్రమలో హెల్త్ కేర్ అడ్మినిస్ట్రేటివ్ ప్రొఫెషనల్స్ అవకాశాలు, సవాళ్లు' అంశంపై శుక్రవారం వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీసీ ప్రసంగిస్తూ.. హెల్త్ కేర్ రంగంపై అవగాహన పెంచుకుని మానవీయ విలువలతో ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించాలన్నారు. కృత్రిమ మేధతో వైద్యరంగం వినూత్న ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతోందని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ వైద్య రంగంలో పరిశ్రమలను స్థాపించే స్థాయికి అందరూ ఎదగాలని సూచించారు. యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ. ఎం.సురేష్ కుమార్, నేషనల్ హెల్త్ మిషన్ క్వాలిటీ ఇన్సూరెన్స్ రాష్ట్రస్థాయి సలహాదారు పసల జ్యోతి, విభాగాధిపతి ప్రొఫెసర్ బి. నాగరాజు, పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. వర్క్‌షాప్‌నకు హాజరైన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 21 నుంచి 23 వరకు రాష్ట్ర స్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీలు జరుగుతాయని గుంటూరు ఫెన్సింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.అశోక్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి జిల్లా జట్టు ఆన్‌లైన్ ఎన్‌రోల్‌మెంట్ గురువారం స్థానిక బీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేశామన్నారు. ఎఫ్ఏఐ గుర్తింపు పొందిన అండర్–18, 18 ఏళ్లపైబడిన వారు 70755 08842 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

20 నుంచి ఇంజినీరింగ్ విద్యార్థులకు క్రీడా పోటీలు



క్రీడా పోటీల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న రాధాకృష్ణమూర్తి, దుర్గాప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఈ నెల 20, 21వ తేదీల్లో 'ఆదర్శ్ 2024' పేరుతో రాష్ట్ర స్థాయి అంతర్ ఇంజినీరింగ్ కళాశాలల క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి తెలిపారు. బుధవారం కళాశాలలో క్రీడా పోటీలకు సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణమూర్తి మాట్లాడుతూ.. విద్యార్థులలో దాగిన క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ పోటీలు వేదిక అన్నారు. 20న క్రీడా పోటీలను రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక విభాగ చైర్‌పర్సన్ పొడపాటి తేజస్విని ప్రారంభించనుండగా, 21న జరిగే బహుమతి ప్రదానోత్సవానికి కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి. ఐజక్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ వజ్రాల నర్సిరెడ్డి, క్రీడోత్సవాల సమన్వయకర్త డాక్టర్ కేవీఎస్ దుర్గాప్రసాద్, సాంస్కృతిక విభాగాల సమన్వయకర్త కొల్లా సుస్మిత చౌదరి, కృష్ణార్జునరావు, ఫిజికల్ డైరెక్టర్ క్రోసూరు రవి తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లపై పోలీసులకు ఫిర్యాదు

పెదకాకాని: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం పెద్ద ఎత్తున దుమారం రేపుతోంది. ఈ సర్టిఫికెట్లతో వర్సిటీలో పీజీ కోర్సులకు పలువురు దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల ఇంటర్వ్యూల్లో గుర్తించిన స్పాట్ అడ్మిషన్ డైరెక్టర్ బ్రహ్మాజీరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ శివప్రసాద్‌లు ఉన్నతాధికారుల దృష్టికి విషయం తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి విచారణ జరపాలని పెదకాకాని పోలీసులకు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం ఫిర్యాదు చేశారు. దీనిపై బుధవారం పెదకాకాని సీఐ టి.పి. నారాయణ స్వామిని వివరణ కోరగా.. వర్సిటీ నుంచి ఫిర్యాదు అందిందని, ఉన్నతాధికారుల అనుమతి మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బగ్గి నరసింహారావు

సత్తెనపల్లి: మహిళలు రక్షణ చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బగ్గి నరసింహారావు చెప్పారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సత్తెనపల్లిలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం పల్నాడు జిల్లా స్థాయి మహిళా రక్షణ చట్టాలపై నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శిబిరానికి దళిత బహుజన రిసోర్స్ సెంటర్ పల్నాడు, గుంటూరు జిల్లాల రీజినల్ కో–ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షత వహించారు. నరసింహారావు మాట్లాడుతూ పలు చట్టాల గురించి వివరించారు. ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణ చట్టం గురించి వివరించారు. ఐసీడీఎస్ ఏసీడీపీఓ సంతోష కుమారి మాట్లాడుతూ గృహహింస చట్టంపై అవగాహన కల్పించారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శిక్షణ శిబిరంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.ప్రమీల, దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఏరియా కో–ఆర్డినేటర్లు మేడే వెంకటరమణ, గడ్డిపర్తి కోటిరత్నం, తోకల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

గురజాల: పట్టణంలోని పాతపాటేశ్వరి అమ్మ తిరునాళ్లను పురస్కరించుకుని రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల ఎడ్ల బల ప్రదర్శన పోటీలు మూడో రోజు బుధవారం ఉత్సాహంగా సాగాయి. న్యూ కేటగిరి ఎద్దుల పోటీల్లో బాపట్ల జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత 5,800 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతిని, తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్‌కు చెందిన డి.రోహన్ బాబు ఎడ్ల జత 5,600 అడుగుల దూరం లాగి రెండో బహుమతిని, గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం పాలడుగుకు చెందిన శాఖమూరి విజయ పవన్ కుమార్, వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, విజయవాడకు చెందిన వల్లభనేని మోహన్‌రావు ఎడ్ల జతలు 5012.9 అడుగుల దూరం లాగి మూడో బహుమతిని, పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కోమేరపూడికి చెందిన యర్రా ఏసుబాబు చౌదరి ఎడ్ల జత 4,800 అడుగుల దూరం లాగి నాలుగో బహుమతిని, పల్నాడు జిల్లా క్రోసూరు మండలం ఉయ్యందనకు చెందిన సంపటం వీరబ్రహ్మం నాయుడు ఎడ్ల జత 4783.6 అడుగుల దూరం లాగి ఐదో బహుమతిని పొందాయి. గుంటూరుకు చెందిన సోమిశెట్టి ఆంజనేయులు ఎడ్ల జత 4636.7 అడుగుల దూరం లాగి ఆరో బహుమతిని, పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం, దొండపాడుకు చెందిన యర్రం రాజశేఖర్, తెలంగాణ రాష్ట్రం హుజూర్ నగర్‌కు చెందిన జక్కుల సహస్రయాదవ్ ఎడ్ల జత 4,600 అడుగుల దూరం లాగి ఏడో బహుమతిని కైవసం చేసుకున్నాయి. గురువారం 6 పళ్ల జతల విభాగంలో పోటీలు నిర్వహిస్తామని కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బజారు బ్రాంచి మేనేజర్ జి.అనిల్‌కుమార్ ప్రారంభించారు. కమిటీ సభ్యులు ఆయనను దుశ్శాలువాలతో సత్కరించారు.

'విరమణ'లకు విస్తృత ఏర్పాట్లు

- 6 లక్షల మంది భవానీలు వస్తారని అంచనా
- పనులు పర్యవేక్షించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్‌బాబు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీ దీక్షల విరమణకు ముమ్మరంగా ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా త్వరితగతిన అమ్మవారి దర్శనం కల్పించేలా పనులు చేపడుతున్నామన్నారు. భవానీ దీక్షల విరమణ కార్యక్రమం సందర్భంగా భక్తులకు ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలను బుధవారం కలెక్టర్ లక్ష్మీశ, జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు, దేవదాయ, రెవెన్యూ, పోలీస్, వైద్య, ఆరోగ్య, అగ్నిమాపక, నగరపాలక సంస్థ, విద్యుత్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, మత్స్యశాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 21 నుంచి 25 వరకు భవానీ భక్తులు అమ్మవారికి ఇరుముడులు సమర్పించి దీక్షలు విరమించనున్నారన్నారు. రోజుకు లక్ష మంది చొప్పున 6 లక్షల మంది భవానీలు భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని అంచనా వేస్తున్నట్లు చెప్పారు.

దసరా ఉత్సవాల తరహాలో..

దసరా ఉత్సవాలు విజయవంతం చేసిన తరహాలో భవానీ దీక్ష విరమణల కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ చెప్పారు. క్యూ మార్గంలో వాటర్ ప్రూఫ్ షామియానాలు, క్వాయర్ మ్యాట్లు, తాగునీరు సరఫరా వంటివి ఏర్పాటు చేస్తున్నామన్నారు. పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం ద్వారా భక్తులకు నిరంతరం సూచనలు, సమాచారం అందిస్తామన్నారు. ఆలయం చుట్టుపక్కల మాత్రమే కాకుండా నగరానికి వచ్చే వివిధ రహదారుల వెంబడి వైద్య శిబిరాలతో పాటు విశ్రాంతి ప్రాంగణాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులకు త్వరితగతిన అమ్మవారి దర్శనం కల్పించి ఇరుముడులు సమర్పించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. భక్తులకు అవసరమైన లడ్డూ ప్రసాదాలను సిద్ధంగా ఉంచాలని దేవదాయ అధికారులను ఆదేశించారు. ఘాట్ల వద్ద స్నానం ఆచరించి మాల విరమణ అనంతరం ఎర్ర వస్త్రాలు నీటిలో వదిలే ప్రాంతంలో పారిశుద్ధ్యం నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రత్యేక యాప్ ద్వారా సమాచారం..

నగర పోలీస్ కమిషనర్ రాజ శేఖర్ బాబు మాట్లాడుతూ భవానీ దీక్ష విరమణ భక్తుల కోసం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. క్యూ లైన్ల ఏర్పాట్లు వెయింటిగ్ హాళ్లు, పార్కింగ్ స్థలాలు, లడ్డూప్రసాదం, అన్నప్రసాదాల పంపిణీ వంటి వివరాలు యాప్ ద్వారా భక్తులకు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. అన్ని ముఖ్య ప్రాంతాల్లో సీసీ టీవీలను అమర్చామన్నారు. విభిన్న ప్రతిభావంతుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

పారిశుద్ధ్యానికి ప్రత్యేక బృందాలు..

విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం. ధ్యాన చంద్ర మాట్లాడుతూ పారిశుద్ధ్యానికి సంబంధించి ప్రత్యేక టీమ్‌లను సిద్ధం చేశామన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ, స్వచ్ఛంద సంస్థలు, వలంటీర్ల సేవలను వినియోగించుకుని కార్యక్రమ విజయవంతానికి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆలయ ఈవో కేఎస్ రామరావు మాట్లాడుతూ సీతమ్మవారి పాదాలు, పున్నమీ ఘాట్, భవానీ ఘాట్ వద్ద మొత్తం 800 వరకు షవర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విజయవాడ ఆర్డీవో చైతన్య, ఆలయ ఈఈలు కోటేశ్వరరావు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

భక్తుల భద్రతకు ప్రాధాన్యం..



యాప్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

దీక్ష విరమణలపై బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ.. పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబుతో కలిసి ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌తో మాట్లాడుతూ సమన్వయ శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమీకృత కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. గిరిప్రదక్షిణ ప్రాంతం, క్యూ లైన్లు, ఇరుముడుల పాయింట్లు, హోమ గుండాలు, ఘాట్లు, సీసీ కెమెరాల ఏర్పాటుపైనా అధికారులకు సూచనలిచ్చారు. రాజీవ్‌గాంధీ పార్కు, పున్నమీ ఘాట్, భవానీ ఘాట్, బబ్బూరి గ్రౌండ్స్, టీటీడీ స్థలం (కుమ్మరిపాలెం), సితార సెంటర్, లోటస్ పక్కన (పున్నమీ ఘాట్), బీఆర్‌టీఎస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పార్కింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన యాప్‌ను ఆవిష్కరించారు. దేవస్థాన ఈవో కేఎస్ రామరావు, డెప్యూటీ ఈవో ఎం.రత్నరాజు, డీసీపీ గౌతమిశాలి, డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో వ్యక్తి మృతదేహం

కానూరు వాసిగా గుర్తింపు



నది నుంచి బయటకు తీసిన రామకృష్ణ మృతదేహం



బ్యాంకు పాస్‌బుక్‌పై ఉన్న ఫొటో

తాడేపల్లి రూరల్: కృష్ణానది పుష్కర ఘాట్‌ల వద్ద మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న తాడేపల్లి పోలీసులు బుధవారం రాత్రి అక్కడికి చేరుకున్నారు. నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని వెలికి తీయించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మృతదేహాన్ని వెలికి తీశామని, ఒడ్డున ఏపీ 39 వీజే 9929 నెంబరు ఆటో నిలిపి ఉందని తెలిపారు. ఆటోను పరిశీలించగా రామకృష్ణ పేరుతో ఆధార్ కార్డు లభించిందని, దాని ఆధారంగా ఆ వ్యక్తిది విజయవాడ కానూరు అని నిర్ధారించామని చెప్పారు. ఆటోలో బ్యాంక్ పాసు పుస్తకం, ఫోన్ లభించాయన్నారు. ఫోన్‌లో కాంటాక్ట్ నెంబర్లను సంప్రదించగా ఎవరూ సరైన సమాధానం ఇవ్వలేదని, బ్యాంక్ పాసు పుస్తకంలో ఉన్న అడ్రస్, ఆటో సీ బుక్‌లో చిరునామాలు వేరువేరుగా ఉన్నాయని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని పేర్కొన్నారు. మూడు అడ్రస్‌లను పరిశీలించి రామకృష్ణ మృతికి కారణాలు తెలుసుకుంటామని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.